సాక్షి
అనంతపురం
సోమవారం । 28 । ఏప్రిల్ । 2025



దగాపడిన అన్నదాత
రైతు సంక్షేమాన్ని కూటమి ప్రభుత్వం పూర్తిగా గాలికొదిలేయడంతో అన్నదాతల పరిస్థితి రోజురోజుకూ దిగజారుతోంది. 8లో



ఆర్డీటీని కాపాడుకుందాం
ఆర్డీటీని కాపాడుకుందామనే డిమాండ్‌పై అనంతపురంలోని పెన్షనర్స్ భవన్‌లో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. 8లో

గరిష్టం/కనిష్టం
40.4°/24.1°

జిల్లా అంతటా ఆదివారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. వేసవితాపం అధికంగా కొనసాగుతోంది. నైరుతి దిశగా గంటకు 6 నుంచి 8 కిలో మీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

హ్యాండ్‌బాల్ చాంపియన్ కర్నూలు


విజేత జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న దృశ్యం


కదిరి అర్బన్: స్థానిక ఎస్టీఎస్ఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రెండు రోజులుగా జరిగిన 54వ రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో కర్నూలు జట్టు చాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకుంది. మొత్తం 16 జట్లు ఈ టోర్నీలో పాల్గొన్నాయి. ఆదివారం టోర్నీ ముగిసింది. ప్రథమ స్థానం కర్నూలు, ద్వితీయ స్థానం పశ్చిమగోదావరి, తృతీయ స్థానంలో శ్రీసత్యసాయి జిల్లా జట్లు నిలిచాయి. విజేత జట్టుకు సీనియర్ హ్యాండ్‌బాల్ క్రీడాకారుడు ప్రసాద్ ట్రోఫీని ప్రదానం చేశారు. కార్యక్రమంలో జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి మహేష్‌తో పాటు పలువురు క్రీడాకారులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా బీసీ గురుకులాల ప్రవేశ పరీక్ష

అనంతపురం ఎడ్యుకేషన్: జిల్లాలోని మహాత్మా జ్యోతిబా బీసీ గురుకుల పాఠశాలల్లో 2025–26 విద్యా సంవత్సరంలో ఐదో తరగతి ప్రవేశాలకు ఆదివారం నిర్వహించిన పరీక్ష ప్రశాంతంగా జరిగింది. ఏడు కేంద్రాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష నిర్వహించారు. మొత్తం 2,016 మంది విద్యార్థులకు గాను 1,757 మంది హాజరయ్యారు. కొనకొండ్ల కేంద్రంలో 600 మందికి 537 మంది, కుందుర్పిలో 300 మందికి 265, నార్పలలో 500 మందికి 460, గోనబావిలో 305 మందికి 251, డి.హీరేహాళ్‌లో 199 మందికి 156, అనంతపురంలో 77 మందికి 61, కళ్యాణదుర్గంలో 35 మందికి గాను 27 మంది విద్యార్థులు హాజరయ్యారని బీసీ గురుకుల పాఠశాలల జిల్లా కన్వీనర్ జోనాథన్ తెలిపారు. ఎంపికైన విద్యార్థుల వివరాలను తల్లిదండ్రులకు తెలియజేస్తామన్నారు. ఆయా పాఠశాలల నోటీస్ బోర్డుల్లోనూ జాబితాలను ఉంచుతామన్నారు.

చిరుతల సంచారం

- గుడిబండ వాసుల ఆందోళన


కొండపై సంచరిస్తున్న చిరుత

గుడిబండ: మండల కేంద్రంలో చిరుతల సంచారం మరోసారి కలకలం రేపుతోంది. ఆదివారం ఉదయం గ్రామానికి సమీపంలోని కొండపై చిరుతలు గుంపులుగా సంచరిస్తున్నట్లు ప్రజలు గుర్తించారు. చాలా కాలంగా కొండపై ఉన్న పొదల్లో చిరుతలు తిష్ట వేసి ఉన్నాయంటున్నారు. రాత్రి పూట నివాసాల వద్దకు వచ్చి పశువులు, మేకలు, గొర్రెలపై దాడి చేస్తున్నట్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో రైతులు పొలాల వద్దకు వెళ్లేందుకు భయపడుతున్నారు. అటవీశాఖ అధికారులకు చాలా రోజుల నుంచి ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడంలేదని చెబుతున్నారు. కనీసం ఇప్పటికైనా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

వీడియో వైరల్ కేసులో నిందితుడికి రిమాండ్

- మరో నలుగురిపై కేసు నమోదు



పరిగి: మతపరమైన అంశంలో అనుచిత వ్యాఖ్యలు చేస్తూ సామాజిక మాధ్యమాల్లో వీడియో పోస్ట్ చేసిన పరిగికి చెందిన ఓ యువకుడిని అరెస్ట్ చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ రంగడు యాదవ్ తెలిపారు. తెలంగాణకు చెందిన ఓ యువతి కొన్ని రోజుల క్రితం సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేసిన వీడియోపై సదరు యువకుడు మతపరమైన దూషణకు పాల్పడడమే కాకుండా యువతిని అసభ్య పదజాలంతో దూషించడాన్ని నిరసిస్తూ శనివారం పరిగిలో ఉద్రిక్తత నెలకొంది. దీనిపై పోలీసులు సకాలంలో స్పందించి ఈ అంశం వివాదం కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకున్నారు. ఈ క్రమంలో వీడియో వైరల్ చేసిన యువకుడిని అదుపులోకి తీసుకుని, ఆదివారం కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించారు. అలాగే రెచ్చగొట్టేలా వీడియోను రూపొందించి వైరల్ చేసిన మరో నలుగురిపై కేసులు నమోదు చేశారు.

మురికిపాలిటీలు!

మురికివాడలను తలపిస్తున్న పట్టణాలు

- చెత్తతో పేరుకుపోయిన వీధులు
- కుక్కలు, పందుల స్వైరవిహారం
- వ్యర్థాల నిర్వహణలో అధికారుల విఫలం
- 'క్లాప్' ఆటోలను నిలిపి చోద్యం చూస్తున్న కూటమి సర్కారు


అనంతపురం నగరం నడిబొడ్డున ఎన్టీఆర్ విగ్రహం వద్ద పేరుకుపోయిన చెత్తాచెదారం


అనంతపురం సూర్యానగర్‌లోని ప్రధాన డ్రైనేజీలో పేరుకుపోయిన చెత్తాచెదారం

జిల్లాలోని మున్సిపాలిటీల్లో పరిస్థితి ఇలా..

మున్సిపాలిటీ	గృహాలు	రోజుకు ఉత్పత్తయ్యే చెత్త (మెట్రిక్ టన్నుల్లో)
అనంతపురం	78,339	125
గుంతకల్లు	34,718	67
తాడిపత్రి	30,429	60
రాయదుర్గం	18,426	27
గుత్తి	13,850	24
కళ్యాణదుర్గం	12,247	19.2

సాక్షి ప్రతినిధి, అనంతపురం: జిల్లాలోని మున్సిపాలిటీల్లో స్వచ్ఛత కరువైంది. ఎక్కడ చూసినా చెత్తకుప్పలు, పందులు, కుక్కలతో భయానక వాతావరణం కనిపిస్తోంది. క్రమం తప్పకుండా పన్నులు కట్టే తమకు మురికి, చెత్తను కూటమి సర్కారు బహుమతిగా ఇచ్చిందని పట్టణ ప్రజలు వాపోతున్నారు.

ఎక్కడి చెత్త అక్కడే...

జిల్లాలో ఐదు మున్సిపాలిటీలు, ఒక నగర పాలక సంస్థ ఉన్నాయి. మున్సిపాలిటీల్లో 'రియల్' వెంచర్లు, కొత్త భవనాల నుంచి పన్నుల వసూళ్లలో ముందుండే మున్సిపల్ అధికారులు చెత్త నిర్వహణను మాత్రం గాలికొదిలేశారు. గత ప్రభుత్వ హయాంలో ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరించి డంపింగ్ యార్డుకు తరలించే వారు. ఇందుకోసం క్లీన్ ఆంధ్రప్రదేశ్ (క్లాప్) కార్యక్రమంలో భాగంగా ఆటోలు ప్రవేశపెట్టారు. అలాంటి ఆటోలను కూటమి సర్కారు వచ్చాక తొలగించారు. దీంతో చెత్త తరలించే దిక్కులేకుండా పోయింది. ఏ మున్సిపాలిటీలో చూసినా వీధులన్నీ చెత్తమయం అయ్యాయి. మున్సిపల్ అధికారులకు ప్రజలు ఎన్ని ఫిర్యాదులు చేసినా స్పందించడం లేదు.

కుక్కలు, పందులకు నిలయాలుగా..

మున్సిపాలిటీల్లో కుక్కలు, పందులు స్వైర విహారం చేస్తున్నాయి. కుక్కలకు కుటుంబ నియంత్రణ చేస్తున్నామని చెప్పడమే కానీ ఫలితం మాత్రం కనిపించడం లేదు. ఈ క్రమంలో ప్రజలు ఒంటరిగా వెళ్లాలంటే భయపడుతున్నారు. ఇటీవల రాయదుర్గం, కళ్యాణదుర్గం మున్సిపాలిటీల్లో కుక్కలు బీభత్సం సృష్టించాయి. పట్టపగలే స్కూలు చిన్నారులను కరిచి భీతిగొల్పాయి. మురికి, చెత్త పేరుకుపోయిన నేపథ్యంలో జిల్లాలోని ఒకే ఒక్క కార్పొరేషన్ అయిన అనంతపురాన్ని నేడు 'మురికిపురం' అంటున్నారు. ప్రధాన రహదారుల్లోనే చెత్త పేరుకుపోయింది. ఇక వీధుల్లో సంగతి చెప్పనక్కర్లేదు.

గుత్తిలో ఘోరం

ఒక వైపు వీధుల్లో చెత్త, మరోవైపు నీటి ఎద్దడితో గుత్తి మున్సిపాలిటీ ప్రజలు విలవిలలాడుతున్నారు. 45 వేల మందికి పైగా ఉండే ఈ మున్సిపాలిటీలో 13 రోజులకు ఒకసారి నీళ్లు ఇస్తున్న పరిస్థితి. కాలనీ వాసులు గుక్కెడు నీటికోసం తహతహలాడుతున్నారు. మార్చి 15 నుంచి ఇక్కడ తీవ్ర తాగునీటి ఎద్దడి నెలకొంది. ఈ క్రమంలోనే ఇటీవల మహిళలు ఖాళీ బిందెలతో రోడ్డుపైకి వచ్చి ఆందోళన చేశారు.

మురికి కూపంగా మారుతోంది



“ ఎక్కడి చెత్త అక్కడే పేరుకుపోయి..పట్టణం మురికి కూపంగా మారుతోంది. ప్రధాన రహదారుల్లో మాత్రమే చెత్తను తొలగిస్తూ..శివారు కాలనీలను ఏమాత్రమూ పట్టించుకోవడం లేదు. డ్రైనేజీల శుభ్రత గాలికొదిలేయడంతో దుర్వాసన వెదజల్లుతున్నాయి. పందులు స్వైర విహారం చేస్తున్నాయి. ఒకవైపు మండుతున్న ఎండలు, మరోవైపు వర్షాలు కురుస్తుండడంతో వాతావరణంలో మార్పులు చోటు చేసుకుంటున్నాయి. దీనికితోడు చెత్తా చెదారం పేరుకుపోతుండడంతో వ్యాధులు ముసిరే ప్రమాదముంది.
– లక్ష్మి, గృహిణి, రాయదుర్గం

పరిస్థితి అధ్వానం



ఇంటింటా చెత్త సేకరణ సక్రమంగా చేపట్టడం లేదు. గత ప్రభుత్వంలో రోజూ ఉదయాన్నే చెత్త సేకరణకు ఆటో మా ఇంటి ముందుకు వచ్చేది. ఇప్పుడు పరిస్థితి చాలా అధ్వానంగా మారింది. వారానికి రెండు రోజులు మాత్రమే చెత్త సేకరణ ట్రాక్టర్ వస్తోంది. గతంలో మాదిరి చెత్త సేకరణ జరిగేలా మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలి.
–ప్రదీప్ ఆచారి,గుంతకల్లు

దుర్వాసన భరించలేకపోతున్నాం



విద్యుత్ నగర్ సర్కిల్‌కు దగ్గర్లోనే చెత్తను డంప్ చేస్తున్నారు. దీంతో వీధంతా దుర్వాసన వస్తోంది. భరించలేకపోతున్నాం. చెత్తను ఎప్పటికప్పుడు తీసుకెళ్లాలి. బ్లీచింగ్ చల్లాలి. సీజనల్ వ్యాధులు ప్రబలే సమయంలో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి.
– రమేష్, విద్యుత్‌నగర్, అనంతపురం

పీఏబీఆర్‌లో తగ్గిన నీటిమట్టం


రిజర్వాయర్‌లో నిల్వ ఉన్న నీరు

కూడేరు: ఇన్‌ఫ్లో లేక కూడేరు మండలంలోని పెన్నహోబిలం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (పీఏబీఆర్)లో నీటి మట్టం తగ్గింది. ఆదివారం నాటికి రిజర్వాయర్‌లో 2.62 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు డ్యాం ఇరిగేషన్ అధికారులు వెల్లడించారు. జలాశయం వద్ద ఏర్పాటైన అనంతపురం, శ్రీసత్యసాయి, ఉరవకొండ తాగునీటి ప్రాజెక్ట్‌లకు రోజుకు సుమారు 40 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. లీకేజీ, ఆవిరి రూపంలో సుమారు 60 క్యూసెక్కుల వరకు నీరు బయటకు వెళుతోంది.

సాయి నామమే మధురం


నృత్యం చేస్తున్న చిన్నారులు

ప్రశాంతి నిలయం: పర్తియాత్రలో భాగంగా పుట్టపర్తి ప్రశాంతి నిలయానికి విచ్చేసిన తెలంగాణ రాష్ట్రంలోని నాగర్‌కర్నూల్ జిల్లా సత్యసాయి భక్తులు సత్యసాయి మహాసమాధి చెంత నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. ఆదివారం సాయంత్రం సాయికుల్వంత్ సభా మందిరంలో బాలవికాస్, సత్యసాయియూత్ బృందం నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. అనంతరం సత్యసాయిని కీర్తిస్తూ సంగీత కచేరీ నిర్వహించారు.

రాజధాని పేరుతో రియల్ వ్యాపారం

- సూపర్ సిక్స్ హామీలను విస్మరించారు
- పోలవరం ఎత్తుపై ప్రధాన మోదీని ఒప్పించాలి
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత


విలేకరులతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం కార్పొరేషన్: కూటమి ప్రభుత్వం ఏర్పాటై 11 నెలలవుతున్నా.. సూపర్ సిక్స్ హామీల్లో ఒక్కటీ అమలు చేయకపోగా, రాజధాని పేరుతో రియల్ ఎస్టేట్ వ్యాపారానికి సీఎం చంద్రబాబు తెరలేపారని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకట రామిరెడ్డి విమర్శించారు. రాష్ట్ర ప్రయోజనాల కంటే రాజకీయ ప్రయోజనాలే ముఖ్యమనే రీతిలో చంద్రబాబు వ్యవహరిస్తున్నారని, ఫలితంగా రాష్ట్ర భవిష్యత్తు అగమ్యగోచరంగా మారిందని అన్నారు. ఆదివారం ఆయన నగరంలోని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఇప్పటికే రాజధానికి 58 వేల ఎకరాలు అందుబాటులో ఉండగా.. మళ్లీ 44 వేల ఎకరాలు ఎందుకని ప్రశ్నించారు. ఇప్పటికే సేకరించిన భూమిలో అభివృద్ధి చేయలేదని, రైతులకు ప్లాట్లు కేటాయించలేదని, మళ్లీ ల్యాండ్ పూలింగ్, భూసేకరణ అంటున్నారని మండిపడ్డారు. గతంలో రాజధాని పేరుతో ప్రధాని మోదీ మట్టి, నీరు తెచ్చారని, ఇప్పుడు పునర్నిర్మాణం అంటూ మరో డ్రామాకు తెరలేపుతున్నారని విమర్శించారు. ఇప్పటికే రూ.1.47 లక్షల కోట్లు అప్పులు చేయడం సంపద సృష్టి అవుతుందా బాబూ అని ప్రశ్నించారు. వెనుకబడిన రాయలసీమ అభివృద్ధిని ఏమాత్రమూ పట్టించుకోలేదన్నారు. కేంద్రం కుట్రతో పోలవరం ఎత్తును 45.75 మీటర్ల నుంచి 41.15 మీటర్లకు తగ్గిస్తే నీళ్లు ఎలా వస్తాయని ప్రశ్నించారు. పోలవరం ఎత్తు కుదిస్తున్నా మీరు మాట్లాడకుండా పోలవరం–బనకచెర్ల అనుసంధానం పేరుతో మరోసారి మోసం చేస్తున్నారన్నారు. ప్రధాని మోదీ పర్యటనలో పోలవరం ఎత్తు పెంచేందుకు ఒత్తిడి తీసుకురావాలన్నారు. బాబు పాలనలో రూ.99లకు క్వార్టర్ బాటిల్, 99 పైసలకే ఎకరా భూమి ఇస్తున్నారని ఎద్దేవా చేశారు. రూ.కోట్లు విలువైన భూమిని 99 పైసలకే ఇవ్వొచ్చని నిరూపించిన ముఖ్యమంత్రి దేశంలో ఎవరైనా ఉన్నారంటే అది చంద్రబాబేనని విమర్శించారు.

నోరా..? తాటిమట్టా?

సంక్షేమం, అభివృద్ధి విషయంలో కూటమి సర్కారు ఒక ప్రణాళికతో ముందుకెళ్లే పరిస్థితి ఏమాత్రమూ కన్పించడం లేదన్నారు. పింఛన్లు ఇస్తున్నామని గొప్పగా చెబుతున్నారని, వాస్తవానికి 11 నెలల కాలంలోనే మూడు లక్షలకు పైగా పింఛన్లలో కోతపెట్టారని తెలిపారు. మెగా డీఎస్సీ పేరుతో తొలి సంతకం చేసిన చంద్రబాబు ఇప్పుడు 16 వేల పోస్టులకు మాత్రమే నోటిఫికేషన్ ఇచ్చి నిరుద్యోగులను వంచించారన్నారు. ఇవి కూడా వచ్చే విద్యా సంవత్సరానికి భర్తీ చేసే పరిస్థితి కన్పించడం లేదన్నారు. తల్లికి వందనం పేరిట ఒక్కో విద్యార్థికి రూ.15 వేలు ఇస్తామని ఇంత కాలం వెల్లదీశారన్నారు. ఇటీవల చంద్రబాబు తల్లికి వందనం ఒక విడతలో ఇవ్వాలా, ఎలా ఇవ్వాలో ఆలోచిస్తున్నామని చెప్పడం చూస్తే ఆయనది నోరా లేక తాటిమట్టా అని భావించాల్సి వస్తోందని అనంత మండిపడ్డారు. 'అన్నదాత సుఖీభవ' ద్వారా రైతులకు రూ.20 వేలు ఎప్పుడిస్తారని ప్రశ్నించారు. పంటలకు గిట్టుబాటు ధర కల్పించలేదన్నారు. రైతుల ఆత్మహత్యలు, వలసలను ప్రోత్సహించేలా ప్రభుత్వ చర్యలు ఉన్నాయన్నారు. సీఎం చంద్రబాబు, మంత్రులు ఏనాడైనా రైతాంగాన్ని ఆదుకునేందుకు ఒక్క సమీక్ష అయినా చేశారా అని ప్రశ్నించారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆలమూరు శ్రీనివాస రెడ్డి, అధికార ప్రతినిధి చింతకుంట మధు, నాయకులు కేశవరెడ్డి, కార్పొరేటర్ టీవీ చంద్రమోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫలితం లేని 'పరీక్ష'

- డిగ్రీ పరీక్షలు నిర్వహించి ఐదు నెలలు పూర్తి
- నేటికీ ఫలితాలు ప్రకటించని వైనం


ఎస్కేయూ ప్రధాన ద్వారం

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం పరిధిలో డిగ్రీ చదువుతున్న విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది. పరీక్షలు ఎప్పుడు నిర్వహిస్తారో తెలియదు. రాసిన పరీక్షలకు ఫలితాలు ఎప్పుడు వస్తాయో తెలియని పరిస్థితి. వర్సిటీ పరీక్షల విభాగం అస్తవ్యస్తంగా మారడమే ఇందుకు నిదర్శనం . ఫలితాలు సకాలంలో విడుదల చేయకపోవడంతో పీజీ కోర్సులకు వెళ్లలేని పరిస్థితి. మరో వైపు ఉద్యోగం వచ్చిన విద్యార్థులు సైతం ఫలితాలు రాకపోవడంతో నిరీక్షించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

15 వేల మంది నిరీక్షణ..

ఎస్కేయూ పరిధిలో డిగ్రీ మొదటి, మూడో సెమిస్టర్ రెగ్యులర్, మెగా సప్లిమెంటరీ పరీక్షలు గతేడాది నవంబర్‌లో జరిగాయి. వీటితో పాటు ఐదో సెమిస్టర్ పరీక్షలు కూడా నిర్వహించారు. 2014 నుంచి 2024 వరకు డిగ్రీ, బీఈడీ, పీజీ చదివి ఫెయిల్ అయిన విద్యార్థులకు స్పెషల్ మెగా సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించారు. ఏడాది పరీక్షల విధానంలో పరీక్షలు రాసి ఫెయిల్ అయిన విద్యార్థులకు సైతం మెగా సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించారు. 1994 నుంచి ఫెయిల్ అయిన వారికి అవకాశం కల్పించారు. అయితే ఇప్పటి దాకా ఫలితాలు మాత్రం రాలేదు. ఫలితాలు ఎప్పుడు వస్తాయో తెలియని పరిస్థితి. మొత్తం 18 వేల మంది విద్యార్థులు ఫలితాల కోసం నిరీక్షిస్తున్నారు. వాస్తవానికి పరీక్షలు పూర్తయిన నెల రోజుల్లో ఫలితాలు ప్రకటించాల్సి ఉన్నప్పటికీ ఆ దిశగా ప్రయత్నాలు చేయలేదు. పరీక్షల విభాగం ఉన్నతాధికారుల అనుమతి లేకుండానే ఇక్కడ బాగా పనిచేసే సిబ్బందిని ఇతర విభాగాలకు బదిలీ చేయడంతో సమస్య వచ్చిందంటున్నారు.

ఫలితాల విడుదలకు కృషి చేస్తాం

ఫలితాల విడుదలలో జాప్యం జరిగింది వాస్తవమే. బాగా పనిచేస్తున్న వారిని బదిలీ చేయకుండా ఉండాల్సింది. కనీసం సంబంధిత విభాగాధిపతుల అభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకోవాలి. ఫలితాల విడుదలకు కృషి చేస్తాం. – జీవీ రమణ, డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్, ఎస్కేయూ

పలు మండలాల్లో వర్షం


పెనకచెర్లలో టెంకాయ చెట్టుపై పిడుగు పడి మంటలు చెలరేగిన దృశ్యం

అనంతపురం అగ్రికల్చర్ : జిల్లాలో ఆదివారం సాయంత్రం నుంచి అర్ధరాత్రి వరకు పలు మండలాల్లో వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో పాటు అక్కడక్కడ వడగండ్ల వాన పడింది. రాయదుర్గంలో 35 మి.మీ, ఉరవకొండ 30, బెళుగుప్ప, బుక్కరాయసముద్రం, గుంతకల్లులో 20, కూడేరు, గార్లదిన్నె, గుత్తి, పెద్దపప్పూరు, అనంతపురంలో పది మి.మీ మేర వర్షపాతం నమోదైంది. వజ్రకరూరు, బొమ్మనహాళ్, పామిడి, రాప్తాడు, నార్పల, శింగనమల, కణేకల్లు తదితర మండలాల్లో వర్షం కురిసింది. గుమ్మఘట్ట మండలం రంగచేడు, గార్లదిన్నె మండలం పెనకచెర్ల, రాప్తాడు మండలం గొందిరెడ్డిపల్లిలో టెంకాయ చెట్లపై పిడుగులు పడ్డాయి.

కాలువ గట్టునూ వదల్లేదు!

- రెచ్చిపోతున్న టీడీపీ నేతలు
- హెచ్చెల్సీ గట్టు నుంచి యథేచ్ఛగా మట్టి తరలింపు


దర్గాహొన్నూరు వద్ద హెచ్చెల్సీ కాలువ గట్టుపై జేసీబీతో మట్టి తవ్వి ట్రాక్టరులో నింపుతున్న దృశ్యం

బొమ్మనహాళ్: అక్రమ సంపాదన కోసం టీడీపీ నేతలు ఆయకట్టు రైతుల జీవితాలతో ఆడుకుంటున్నారు. ఏకంగా తుంగభద్ర ఎగువ కాలువ (హెచ్చెల్సీ) గట్టు నుంచే మట్టిని తవ్వి అక్రమంగా తరలిస్తున్నారు. కాలువ గట్టు పటిష్టంగా ఉండాలంటే మట్టే ఆధారం. ఇదే మట్టి అక్రమార్కులకు కాసులు కురిపిస్తోంది. హెచ్చెల్సీ అధికారులతో కుమ్మక్కైన అధికార టీడీపీ నేతలు పట్టపగలే కాలువ గట్టుపై మట్టి తవ్వుతూ రోజుకు సుమారు 200 ట్రాక్టర్ల ఎర్రమట్టిని అక్రమంగా తరలిస్తున్నారు. దీనివల్ల గట్టు బలహీనపడి హెచ్చెల్సీకి గండ్లు పడే ప్రమాదముందని, అదే జరిగితే వేలాది ఎకరాల ఆయకట్టు భూములు బీడు పడతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.

కణేకల్లు మండల నేత దందా

కణేకల్లు మండలానికి చెందిన ఓ టీడీపీ నాయకుడు రెండు జేసీబీలు, 12 ట్రాక్టర్లను పెట్టి.. బొమ్మనహాళ్ మండలం దర్గాహొన్నూరు గ్రామ శివారులోని హెచ్చెల్సీ కాలువ గట్టు నుంచి ఎర్రమట్టిని దాదాపు పది రోజులుగా తరలిస్తున్నారు. కణేకల్లు మండలంలోని మీండ్లపల్లి–నాగేపల్లి మార్గంలో హెచ్చెల్సీ వద్ద జీప్ ట్రాక్ వేసేందుకు ఈ మట్టిని తరలిస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. అయితే..కాలువ గట్టును 8 నుంచి 10 అడుగుల వరకు తవ్వుతుండడంతో పూర్తిగా బలహీనపడి.. నీరు వచ్చినప్పుడు గండి పడే అవకాశాలు ఉన్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. మట్టి దందా హెచ్చెల్సీ అధికారులకు తెలిసే జరుగుతున్నట్లు వారు చెబుతున్నారు.

వేరే మట్టితో నింపుతాం

మట్టి దందా విషయాన్ని హెచ్చెల్సీ డీఈఈ మద్దిలేటి దృష్టికి తీసుకెళ్లగా.. దర్గాహొన్నూరు గ్రామ శివారులోని హెచ్చెల్సీ గట్టుకు ఆనుకుని ఉన్న మట్టిని తరలించి.. అక్కడ వేరే మట్టితో నింపేస్తామని చెప్పారు. ఇకమీదట ఎవరైనా అక్రమంగా కాలువ గట్టు నుంచి మట్టిని తరలిస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

నేడు తాడిపత్రి మున్సిపల్ వైస్ చైర్మన్ల ఎన్నిక

తాడిపత్రి రూరల్: స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సోమవారం ఉదయం 11 గంటలకు వైస్ చైర్మన్ ఎన్నిక నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను కమిషనర్ శివరామకృష్ణ పూర్తి చేశారు. రెండు నెలల క్రితం మునిసిపల్ వైస్ చైర్మన్లు సరస్వతి, అబ్దుల్ రహీం తమ పదవులకు రాజీనామా చేసిన విషయం తెలిసిందే. ఇతరులకు అవకాశం కల్పించాలన్న ఆలోచనతో తమ పదవులకు రాజీనామా చేస్తున్నట్లుగా వారు ప్రకటించారు. దీంతో కొత్తగా ఇద్దరిని వైస్ చైర్మన్లుగా ఎన్నుకునేందుకు నోటిఫికేషన్ జారీ అయింది. ఎన్నికల పరిశీలకులుగా జాయింట్ కలెక్టర్ వ్యవహరించనున్నారు.

క్లుప్తంగా

ఇరువర్గాల ఘర్షణ - పలువురికి తీవ్ర గాయాలు



చికిత్స పొందుతున్న లక్ష్మీనారాయణ

గుత్తి: స్థానిక గాంధీ నగర్‌లో శనివారం రాత్రి ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకుని పలువురు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన మేరకు... గాంధీనగర్‌లో నివాసముంటున్న సుబహాన్ ఇంట్లో ఆదివారం శారీ ఫంక్షన్ జరిగింది. ఆ సమయంలో సుబహాన్ వర్గానికి చెందిన కొందరు అకారణంగా లక్ష్మీనారాయణ వర్గాన్ని దూషించారనే కారణంతో ఇరు వర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. రాళ్లు రువ్వుకున్నారు. కట్టెలతో పరస్పరం దాడి చేసుకున్నారు. ఘటనలో లక్ష్మీనారాయణ, నారాయణమ్మ, నబి, సుబహాన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఘటనపై ఇరువర్గాల ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

మూడు ఎద్దుల అపహరణ

గుంతకల్లు రూరల్: మండలంలోని కసాపురం గ్రామ పంచాయతీ చెన్నప్ప కొట్టాల గ్రామంలో పొలంలో కట్టి ఉంచిన మూడు ఎద్దులను శనివారం రాత్రి దుండగులు అపహరించారు. గ్రామానికి చెందిన రైతులు వెంకటరమణ, అంజికుమార్ కొన్నేళ్లుగా గుంతకల్లులో నివాసం ఉంటున్నారు. చెన్నప్ప కొట్టాలలో ఉన్న తమ పొలాల్లో వ్యవసాయం చేసుకుంటూ ఇద్దరు రైతులు తమ ఎద్దులను పొలంలోనే కట్టి ఉంచేవారు. ఈ క్రమంలో శనివారం రాత్రి దుండగులు కట్టి ఉంచిన మూడు ఎద్దులను అపహరించుకెళ్లారు. ఆదివారం ఉదయాన్నే పొలానికి వెళ్లిన రైతులు ఎద్దులను ఎత్తుకెళ్లిన విషయాన్ని గుర్తించారు. మూడు ఎద్దుల ధర సుమారు రూ.1.5 లక్షల వరకూ ఉంటుందన్నారు. ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు బాధిత రైతులు తెలిపారు.

ఎద్దులబండి బోల్తా - రైతుకు గాయాలు

గుత్తి రూరల్: మండలంలోని అనగానదొడ్డి గ్రామ శివారులో ఎద్దులు అదుపుతప్పడంతో బండి బోల్తా పడి రైతుకు గాయాలయ్యాయి. అనగానదొడ్డికి చెందిన రైతు సుంకన్న ఆదివారం తన పొలంలో వ్యవసాయ పనులు ముగించుకుని ఇంటికి వస్తుండగా ఈ ఘటన చోటు చేసుకుంది. ఎద్దులు బెదిరి రోడ్డు పక్కకు దూసుకెళ్లడంతో బండి బోల్తా పడింది. ఘటనలో తీవ్రంగా గాయపడిన సుంకన్నను తోటి రైతులు చికిత్స నిమిత్తం గుత్తిలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం అనంతపురానికి తీసుకెళ్లారు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.



అడిగిన ప్రతి రైతుకూ డ్రిప్, స్ప్రింక్లర్లు అందిస్తామని ఘనంగా ప్రకటించిన చంద్రబాబు సర్కారు జిల్లాకు 41,200 హెక్టార్ల టార్గెట్ ఇచ్చి. చివరకు 17 వేల హెక్టార్లకు మాత్రమే పరిమితమైంది. వ్యవసాయ, ఉద్యాన, పట్టుపరిశ్రమ, పాడి పరిశ్రమ, మత్స్యశాఖ పరిధిలో పథకాలకు సంబంధించి బడ్జెట్ తగ్గించేశారు. అమూల్ పాలవెల్లువను బలవంతంగా ఆపి పాడి రైతుల పొట్ట కొట్టారు. పశుబీమాను అటకెక్కించారు. ప్రతిష్ఠాత్మక ఆర్‌బీకే వ్యవస్థ ద్వారా రైతులకు సేవలు అందకుండా నిర్వీర్యం చేశారు. నియోజకవర్గ స్థాయి వ్యవసాయ, వెటర్నరీ ప్రయోగశాలలను నామమాత్రం చేశారు. మారుమూల ప్రాంతాల్లోని మూగజీవాలకు ప్రాణదానం చేస్తున్న 1962 వెటర్నరీ అంబులెన్స్‌లనూ ఆపేశారు. రైతు సంక్షేమాన్ని కూటమి ప్రభుత్వం పూర్తిగా గాలికొదిలేయడంతో అన్నదాతల పరిస్థితి రోజురోజుకూ దిగజారుతోంది.

– అనంతపురం అగ్రికల్చర్

దగాపడిన అన్నదాత

- పైసా విదల్చని కూటమి ప్రభుత్వం
- సుఖీభవ లేదు. ఇన్‌పుట్, ఇన్సూరెన్స్‌కు గతి లేదు. ఎక్స్‌గ్రేషియా అసలే లేదు
- పంటలు దెబ్బతిన్నా ఖరీఫ్, రబీలో కంటితుడుపుగా కరువు మండలాల ప్రకటన
- ఆర్‌బీకేలు, అగ్రి-వెటర్నరీ ల్యాబ్‌లు నిర్వీర్యం, ఆగిన 1962 అంబులెన్స్ సేవలు

అన్నదాత సుఖీభవ కింద ఏటా ప్రతి రైతుకూ రూ.20 వేలు పెట్టుబడిసాయం అందిస్తామన్న హామీని కూటమి పెద్దలు తుంగలో తొక్కేశారు. ఇదే సమయంలో కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ కింద మూడు విడతల్లో రూ.6 వేలు రైతుల ఖాతాల్లోకి వేసింది. చంద్రబాబు చెప్పినట్లు సుఖీభవ పథకం కింద ఈ ఏడాది రూ.20 వేలు ఇచ్చివుంటే 2.90 లక్షల మంది వరకు రైతులకు రూ.580 కోట్లు జమ అయ్యేవి. పోనీ, పీఎం కిసాన్ రూ.6 వేలతో కలిపి రాష్ట్ర ప్రభుత్వ వాటాగా రూ.14 వేలు ఇచ్చివున్నా రూ.400 కోట్ల పైచిలుకు ప్రయోజనం చేకూరేది. అయితే పైసా ఇవ్వకుండా ఈ ఏడాది మొండి చెయ్యి చూపించారు.

- గతంలో 2019–24 మధ్య వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఏటా పీఎం కిసాన్, రైతు భరోసా కింద రూ.13,500 చొప్పున ఐదేళ్లలో ఒక్కో రైతుకు రూ.67,500 చెల్లించింది. అలా ఐదేళ్లలో జిల్లా రైతులకు రూ.1,937 కోట్ల పెట్టుబడి సాయం అందింది.

దిక్కూమొక్కూ లేని పంటల బీమా

2023 ఖరీఫ్, రబీకి సంబంధించి ఉచిత పంటల బీమా పథకం కింద ఇవ్వాల్సిన పరిహారంతో తమకు సంబంధం లేదన్నట్లుగా సీఎం చంద్రబాబు వ్యవహరిస్తున్నారు. 2024 ఖరీఫ్‌లో ఉచిత పంటల బీమా అమలు చేసినా... పరిహారం చెల్లింపు అనుమానంగానే కనిపిస్తోంది. ఉచిత పంటల బీమా పథకానికి మంగళం పాడేసి రబీ నుంచి రైతుల నుంచి ప్రీమియం కట్టించుకోవడం మొదలు పెట్టారు. ఇలా ఇకపై ఏటా రూ.100 కోట్ల వరకు ప్రీమియం రూపంలో రైతులపై అదనపు భారం మోపారు.

- 2019–24 మధ్య వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతులపై ప్రీమియం భారం పడకుండా ఉచిత పంటల బీమా కింద ఏకంగా జిల్లా రైతులకు రూ.1,967 కోట్ల భారీ మొత్తంలో పరిహారం చెల్లించింది. తొలిసారిగా ఉద్యాన రైతులకు బీమా ఇచ్చి భరోసా కల్పించింది. ఇక ప్రీమియం రూపంలో ఏటా రూ.100 కోట్ల వరకు జిల్లా రైతులకు ఆదా అయ్యేలా చర్యలు తీసుకుంది.

స్పష్టత లేని సున్నా వడ్డీ

ఖరీఫ్, రబీ కింద బ్యాంకుల్లో పంట రుణాలు తీసుకున్న రైతులకు వడ్డీ రాయితీపై చంద్రబాబు ప్రభుత్వం ఎలాంటి స్పష్టత ఇవ్వడం లేదు.

- గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఖరీఫ్, రబీ కింద బ్యాంకుల్లో రూ.లక్ష లోపు పంట రుణాలు తీసుకున్న చిన్న, సన్నకారు రైతులకు సున్నావడ్డీ కింద రూ.72 కోట్ల వరకు వడ్డీ మాఫీ చేయడంతో 3.40 లక్షల మంది రైతులకు ప్రయోజనం చేకూరింది.

మద్దతు ధర హుష్‌కాకి

ఖరీఫ్, రబీ పంట ఉత్పత్తులు అరకొరగానే చేతికొచ్చాయి. గిట్టుబాటు ధర లేకపోవడంతో బహిరంగ మార్కెట్‌లో వ్యాపారులు, దళారులకు తక్కువ ధరకే అమ్ముకుంటున్నారు. కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరించింది.

- గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రూ.350 కోట్ల విలువైన వ్యవసాయ ఉత్పత్తులను మద్దతు ధరతో కొనుగోలు చేసింది.

విత్తనంపై రాయితీ తగ్గింపు

కరువు పరిస్థితులు నెలకొన్నా ఈ రబీలో కేవలం 25 శాతం సబ్సిడీతో విత్తన పప్పుశనగ అందించడంతో జిల్లా రైతులపై రూ.6 కోట్ల వరకు అదనపు భారం పడింది. ఇక ఖరీఫ్‌లో విత్తన వేరుశనగ, కందులు నామమాత్రంగా అందించారు. 80 శాతం రాయితీతో ప్రత్యామ్నాయం అంటూ 27 వేల క్వింటాళ్లకు గానూ 10 వేల క్వింటాళ్లతో సరిపెట్టారు.

- గత జగన్ సర్కార్ 40 శాతం రాయితీతో రైతులకు విత్తనం అందించింది. ఐదేళ్ల జగన్ పాలనలో అన్ని రకాలకు చెందిన 6.70 లక్షల క్వింటాళ్ల విత్తనాలపై రైతులకు రూ.289 కోట్ల రాయితీ దక్కింది.

రైతు ఆత్మహత్య బాధితులకు మొండిచేయి

కూటమి ప్రభుత్వం ఏర్పాటైన ఈ 10 నెలల వ్యవధిలోనే అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్న దాదాపు 43 మంది రైతులకు సంబంధించి ఏ ఒక్కరికీ పరిహారం (ఎక్స్‌గ్రేషియా) అందలేదు. రెండు నెలల క్రితం ప్రభుత్వానికి పంపినా 20 మంది బాధిత రైతు కుటుంబాల జాబితా పత్తా లేకుండా పోయింది.

- గతంలో రైతు ఆత్మహత్య చేసుకున్న రెండు మూడు నెలల్లోపే బాధిత కుటుంబాలకు రూ.7 లక్షల మేర పరిహారాన్ని అప్పటి సీఎం వైఎస్ జగన్ అందజేశారు. ఇలా 280 మంది బాధిత రైతు కుటుంబాలకు రూ.17.40 కోట్ల ఎక్స్‌గ్రేషియాను అందించారు. ఇందులో 110 మంది బాధిత కుటుంబాల్లో రైతులు గతంలో చంద్రబాబు పాలించిన 2014–19 మధ్య కాలంలో ఆత్మహత్య చేసుకున్న వారు కావడం గమనార్హం.

కంటి తుడుపుగా కరువు మండలాలు

2023 రబీలో వర్షాభావ పరిస్థితుల కారణంగా ప్రధాన పప్పుశనగ పంటతో పాటు మిగిలిన పంటలూ దెబ్బతిన్నాయి. అప్పటి ప్రభుత్వం 17 మండలాలను కరవు జాబితాలో ప్రకటించింది. ఈ క్రమంలో చంద్రబాబు ప్రభుత్వం కొలువుతీరిన తర్వాత ఆగస్టులో కేంద్ర కరువు బృందం వచ్చివెళ్లింది. నిబంధనల మేరకు రూ.36 కోట్ల మేర పెట్టుబడి రాయితీ (ఇన్‌పుట్ సబ్సిడీ) చెల్లింపు జాడ లేకుండా పోయింది. అలాగే ఈ ఖరీఫ్‌లో కరువు జాబితాలో కేవలం ఏడు మండలాలనే ప్రకటించి... కేంద్ర బృందాన్ని రప్పించి రూ.19 కోట్లు ఇన్‌పుట్ ఇస్తామన్నారు. దానికి కూడా మోక్షం లేదు. ప్రస్తుత రబీలో కూడా కేవలం ఏడు మండలాలను కరువు జాబితాలోకి చేర్చి చేతులు దులుపుకున్నారు. ఇక ప్రకృతి వైపరీత్యాలతో దెబ్బతిన్న వ్యవసాయ, ఉద్యాన పంటలకు ఇప్పటి వరకూ ఇన్‌పుట్‌సబ్సిడీ ఇవ్వలేదు. ఈ నెల రోజుల వ్యవధిలోనే వ్యవసాయ, ఉద్యాన పంటలకు రూ.50 కోట్లకు పైగా నష్టం వాటిల్లింది.

- గత వైఎస్ జగన్ సర్కార్ ఏ సీజన్‌లో జరిగిన నష్టానికి అదే సీజన్ ముగిసేలోపు ఇన్‌పుట్ పరిహారం చెల్లించి ఆదుకుంది. ఇలా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఐదేళ్ల పాలనలో జిల్లా రైతులకు రూ.377 కోట్ల మేర ఇన్‌పుట్ సబ్సిడీ జమ అయింది.

'వెటర్నరీ' అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎంపిక



ఎంపికైన నూతన కార్యవర్గ సభ్యులు

అనంతపురం అగ్రికల్చర్: పశుసంవర్ధకశాఖ అధికారుల సంఘం (వెటర్నరీ ఆఫీసర్స్ అసోసియేషన్) ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ రామచంద్రారెడ్డి ఎన్నికయ్యారు. ఆదివారం స్థానిక పశుశాఖ డీడీ కార్యాలయంలో రాష్ట్ర కమిటీ ఉపాధ్యక్షుడు పార్థసారథిరెడ్డి ఆధ్వర్యంలో జిల్లా సర్వ సభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లాకు సంబంధించి నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రెడ్డిపల్లి శిక్షణా కేంద్రం ఏడీ డాక్టర్ వి.రామచంద్రారెడ్డిని ఎన్నుకోగా, కార్యదర్శిగా పి.మల్లేష్‌గౌడ్ (కొత్తచెరువు వీహెచ్, ఏడీ), కోశాధికారిగా డాక్టర్ జీఎస్ అమర్ (మడకశిర వీహెచ్, ఏడీ), ఉపాధ్యక్షురాలిగా డాక్టర్ ప్రసన్నబాయి (తలుపుల వీహెచ్, ఏడీ), జాయింట్ సెక్రటరీగా డాక్టర్ ఖదీర్‌బాషా (తాడిపత్రి వీహెచ్, ఏడీ) ఎన్నికయ్యారు. ఎన్నికైన నూతన కార్యవర్గ సభ్యులు రెండు జిల్లాల జేడీలు డాక్టర్ జీపీ వెంకటస్వామి, డాక్టర్ జి.శుభదాస్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

ఆర్డీటీ రక్షణ బాధ్యత సీఎం చంద్రబాబు తీసుకోవాలి

- ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబుకు లేఖ రాసిన వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత



అనంతపురం కార్పొరేషన్: ఐదున్నర దశాబ్దాలుగా సేవలందిస్తున్న రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్టు(ఆర్డీటీ) ఏపీ, తెలంగాణలోని అనేక గ్రామాలకు కల్పతరువని, అటువంటి ట్రస్టు మనుగడ కేంద్రం చర్యలతో ప్రమాదంలో పడిందని, లక్షలాది మంది పేదల అభ్యున్నతికి పాటుపడుతున్న గొప్ప స్వచ్ఛంద సంస్థ రక్షణ బాధ్యతను సీఎం చంద్రబాబు తీసుకోవాలని వైఎస్సార్ సీపీ అనంతపురం జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి డిమాండ్ చేశారు. ఆర్డీటీ సంస్థకు ఫారిన్ కంట్రిబ్యూషన్ రెగ్యులేషన్ యాక్ట్ (ఎఫ్‌సీఆర్‌ఏ) రిజిస్ట్రేషన్‌ను పునరుద్ధరించి సేవలు సజావుగా సాగేలా చూడాలంటూ 1969 నుంచి ఆర్డీటీ అందిస్తున్న సేవలను గుర్తు చేస్తూ.. సీఎం చంద్రబాబు, ప్రధాని మోదీకి అనంత లేఖ రాశారు. ఎఫ్‌సీఆర్‌ఏ రిజిస్ట్రేషన్‌ను పునరుద్ధరించకపోవడంతో ట్రస్టుపై ఆధారపడిన ఎంతో మంది జీవితాలు అగమ్యగోచరంగా మారే పరిస్థితి నెలకొందని పేర్కొన్నారు. బార్సిలోనాలో జన్మించి, స్పానిష్ ఆర్మీలో సైనికుడిగా పని చేసిన ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ మానవత్వానికి హద్దులు లేవన్న రీతిలో ఉమ్మడి అనంతపురం జిల్లాతో పాటు పలు ప్రాంతాల్లో పేదరిక నిర్మూలన, సామాజికంగా వెనుకబడిన వర్గాల అభ్యున్నతి, ప్రజలకు విద్య, వైద్యం అందించేందుకు కృషి చేసి కరుణామయుడిగా పేరొందారని తెలిపారు. 2009లో ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ కన్నుమూశాక..ఆయన సతీమణి అన్నేఫెర్రర్, కుమారుడు మాంఛో ఫెర్రర్ ఆర్డీటీ సేవా కార్యక్రమాలను కొనసాగిస్తున్నారన్నారు. ఈ సంస్థ ద్వారా తెలుగు రాష్ట్రాల్లో 3,500 గ్రామాల ప్రజలు సేవలు పొందుతున్నారని, ఆర్థికంగా వెనుకబడిన 4.5 లక్షల మంది లబ్ధి పొందుతున్నారని వివరించారు. మహిళా సాధికారత, గ్రామీణాభివృద్ధి, సమాజ ఆరోగ్య అభివృద్ధి కోసం కృషి చేస్తోందన్నారు. జిల్లా మొదలుకుని జాతీయ, అంతర్జాతీయ స్థాయి వరకు అన్ని ప్రభుత్వ సంస్థల మన్ననలను ఆర్డీటీ పొందిందని గుర్తు చేశారు. అనంతపురం నగర శివారులో 32 ఎకరాల్లో ఆర్డీటీ స్పోర్ట్స్ సెంటర్‌ను 2002లో ప్రారంభించి.. క్రికెట్, హాకీ, ఫుట్‌బాల్, అథ్లెటిక్స్, జూడో, టెన్నిస్ తదితర క్రీడల్లో జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులను తయారు చేస్తోందన్నారు. 1,433 సప్లిమెంటరీ విద్యాలయాల ద్వారా 2,801 ప్రాజెక్ట్ గ్రామాల్లో విద్యను అందిస్తోందన్నారు. 8,112 స్వయం సహాయక సంఘాలను ఏర్పాటు చేసి.. ఆర్థిక స్వావలంబనకు కృషి చేస్తోందన్నారు. ఇప్పటి వరకు వెనుకబడిన వర్గాల వారికి 84,971 ఇళ్ల నిర్మాణాలను చేపట్టిన విషయాన్ని గుర్తు చేశారు. కోవిడ్ విపత్కర పరిస్థితుల్లో ఆర్డీటీ ఆస్పత్రిలో అన్ని వర్గాల ప్రజలకు ఆయువు పోశారన్నారు. ఆర్డీటీ ఆస్పత్రుల ద్వారా ఏటా 8.5 లక్షల మంది సేవలు పొందుతున్నారని తెలిపారు.

విదేశీ నిధులే కీలకం

ఆర్డీటీ మనుగడకు విదేశీ నిధులే కీలకమని, ఎఫ్‌సీఆర్ యాక్ట్ కింద అనుమతుల పునరుద్ధరణను నిలిపివేస్తూ కేంద్రం ఉత్తర్వులు జారీ చేయడంతో సంస్థ సేవలు ఒక్కొక్కటీ నిలిచిపోయే పరిస్థితి వచ్చిందని తెలిపారు. ఈ క్రమంలోనే ఇటీవల పేద విద్యార్థులకు ఉచిత విద్య అందించే ఆర్డీటీ సెట్‌ను రద్దు చేస్తున్నట్లు సంస్థ ప్రకటించిందని గుర్తు చేశారు. ఉపాధికి ఊతమిచ్చే శిక్షణ కార్యక్రమాలు, స్కాలర్‌షిప్ ప్రోగ్రాంలతో పాటు అన్ని వర్గాల అభ్యున్నతికి దోహదపడే సేవలకు అంతరాయం ఏర్పడే అవకాశం లేకపోలేదన్నారు. నాలుగు సార్లు ముఖ్యమంత్రిగా పని చేసిన చంద్రబాబు ప్రత్యేక చొరవ తీసుకోవాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. కేంద్రం సైతం పేద ప్రజలకు అండగా నిలుస్తున్న ఆర్డీటీ పట్ల వ్యవహరించిన ధోరణి సరికాదని పేర్కొన్నారు. ఆర్డీటీకి వైఎస్సార్ సీపీ అండగా ఉంటుందని స్పష్టం చేశారు.

యువకుడి దుర్మరణం



శివానంద (ఫైల్)

బుక్కరాయసముద్రం: మండలంలోని రేకులకుంట సమీపంలో ఆదివారం రాత్రి చోటు చేసుకున్న ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు.. బీకేఎస్ మండలం దయ్యాలకుంటపల్లికి చెందిన చాకలి శివానంద (28) గ్రామంలో రజక వృత్తితో కుటుంబానికి చేదోడుగా నిలాచాడు. భార్య ప్రసన్నలక్ష్మి, ఇద్దరు కుమారులు ఉన్నారు. వ్యక్తిగత పనిపై ఆదివారం అనంతపురానికి వెళ్లిన ఆయన.. రాత్రి ద్విచక్ర వాహనంపై తిరుగు ప్రయాణమయ్యాడు. రేకులకుంట సమీపంలోకి చేరుకోగానే వేగంగా దూసుకొచ్చిన గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఘటనలో శివానంద కాలు విరిగి 15 అడుగుల దూరంలో పడింది. తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదానికి కారణమైన డ్రైవర్ వాహనం ఆపకుండా దూసుకెళ్లిపోయాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

ఎకాలజీ సెంటర్‌లో ఉచిత శిక్షణ

అనంతపురం అగ్రికల్చర్: ఏఎఫ్ ఎకాలజీ సెంటర్‌లో కంప్యూటర్ కోర్సులపై నిరుద్యోగ యువతకు 45 రోజుల పాటు ఉచిత శిక్షణతో పాటు ఉపాధి అవకాశాలు కల్పించనున్నారు. ఈ మేరకు ఆ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ వైవీ మల్లారెడ్డి ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. మే ఒకటి నుంచి కొత్త బ్యాచ్ ప్రారంభం కానుంది. ఇంటర్ పాస్, డిప్లొమా, డిగ్రీ, ఇంజనీరింగ్ పాస్ లేదా ఫెయిల్ అయిన 20 నుంచి 35 సంవత్సరాల మధ్య వయస్సున్న నిరుద్యోగ యువతీయువకులు అర్హులు. బేసిక్స్ కంప్యూటర్ స్కిల్స్, ఎంఎస్ ఆఫీసు, బేసిక్ ట్యాలీ, లైఫ్ స్కిల్స్, వర్క్‌ప్లేస్ ఎథిక్స్, బేసిక్ స్పోకెన్ ఇంగ్లీషు, కస్టమర్ రిలేషన్‌షిప్ స్కిల్స్ తదితర అంశాలపై శిక్షణ ఉంటుంది. శిక్షణా సమయంలో మధ్యాహ్నం భోజన వసతి ఉంటుంది. శిక్షణ ముగిసిన తర్వాత సర్టిఫికెట్‌తో పాటు ఉపాధి అవకాశాలు కల్పిస్తారు. పూర్తి వివరాలకు 73969 50345లో సంప్రదించవచ్చు.

వృద్ధుడి బలవన్మరణం

సోమందేపల్లి: జీవితంపై విరక్తితో ఓ వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... సోమందేపల్లి మండలం మాగేచెరువు గ్రామానికి చెందిన రామప్ప (68)కు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. చిన్న కుమారుడు వెంకటేష్ ఇంట్లోనే నివాసముంటున్న ఆయన శనివారం రాత్రి అందరితో కలసి భోజనం ముగించుకుని నిద్ర పోయాడు. ఆదివారం తెల్లవారుజామున కుటుంబసభ్యులు నిద్రలేచి చూసేసరికి ఓ గదిలో పైకప్పునకు ఉరి వేసుకుని విగతజీవిగా వేలాడుతూ రామప్ప కనిపించాడు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ రమేష్ బాబు ఆ గ్రామానికి చేరుకుని పరిశీలించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

ఆర్డీటీని కాపాడుకుందాం

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు రాంభూపాల్



మాట్లాడుతున్న వి.రాంభూపాల్

అనంతపురం టవర్‌క్లాక్: నిరుపేదల జీవనోపాధుల కోసం విశేష కృషి చేస్తున్న ఆర్డీటీకి నిధులు రాకుండా కేంద్రంలోని కూటమి ప్రభుత్వం అడ్డుకుంటోందని, ఇలాంటి తరుణంలో ఆర్డీటీని కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వి.రాంభూపాల్ పిలుపునిచ్చారు. ఆర్డీటీని కాపాడుకుందామనే డిమాండ్‌పై అనంతపురంలోని పెన్షనర్స్ భవన్‌లో ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో ఆదివారం రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. సమావేశంలో రాంభూపాల్ మాట్లాడుతూ.. కేంద్రంలో బీజేపీ అధికార పగ్గాలు చేపట్టిన తర్వాత ఆర్డీటీకు విదేశీ నిధులు రాకుండా అడ్డుపడిందన్నారు. గతంలో ఎన్నడూ ఇలాంటి పరిస్థితి చూడలేదన్నారు. దీని వల్ల సంస్థ సేవలు నిలిచి పోయే పరిస్థితి వచ్చిందన్నారు. నిత్యం కరువు కాటకాలతో విలవిల్లాడుతున్న జిల్లాకు ఆర్డీటీ వరదాయినిగా నిలిచిందన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఆర్డీటీకి నిధులు అందకపోతే నష్టపోయేది పేదలేనన్నారు. మతం పేరుతో బీజేపీ ఇలాంటి దురాగతాలకు పాల్పడడం తగదన్నారు. కులాలు, మతాలకు అతీతంగా సేవలు అందిస్తున్న సంస్థపై ఆంక్షలు సరికాదన్నారు. పేదలు ఐక్యతతో ఉద్యమాలు చేపట్టి ఆర్డీటీని కాపాడుకోవల్సిన తరుణం ఆసన్నమైందన్నారు. ఈ పోరాటాలకు కుల, ప్రజాసంఘాలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. సంస్థ అందజేస్తున్న ఉచిత విద్యతో ఎందరో ఇంజినీర్లు, డాక్టర్లుగా జీవితంలో స్థిరపడ్డారన్నారు. తక్షణమే కేంద్రంతో రాష్ట్ర ప్రభుత్వం చర్చలు జరిపి ఆర్డీటీకి విదేశీ నిధులు అందేలా చొరవ తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే పెద్ద ఎత్తున పోరాటాలు సాగిస్తామన్నారు. కార్యక్రమంలో ప్రజాసంఘాలు, కుల సంఘాల నాయకులు గోవిందరాజులు, ఎస్.ఎం.బాషా, సాకే హరి, నెరమెట్ల ఎల్లన్న, ఓ.నల్లప్ప, కృష్ణమూర్తి, చంద్రశేఖర్ రెడ్డి, ఓబులేసు, రాహుల్, శివారెడ్డి, కేశవరెడ్డి, చంద్రశేఖర్, శ్రీనివాసులు, సాయికుమార్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో కౌలు రైతు మృతి



శ్రీరామ్ (ఫైల్)

బొమ్మనహాళ్: విద్యుత్ షాక్‌కు గురై ఓ కౌలు రైతు మృతి చెందాడు. స్థానికులు తెలిపిన మేరకు.. బొమ్మనహాళ్ మండలం దర్గాహొన్నూరులో నివాసముంటున్న శ్రీరామ్ (33)కు భార్య మహాలక్ష్మి, ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. వ్యవసాయ పనులతో జీవనం సాగిస్తున్న ఆయన.. అదే గ్రామ నివాసి రైతు ఆనందరెడ్డికి చెందిన ఆరు ఎకరాల పొలాన్ని కౌలుకు తీసుకుని వారం రోజుల క్రితం సజ్జ పంట సాగు చేశాడు. శనివారం అర్ధరాత్రి సమయంలో వ్యవసాయానికి విద్యుత్ సరఫరా కావడంతో పంటకు నీరు పెట్టేందుకు పొలానికి వెళ్లి, ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. నిరుపేద కౌలు రైతు కుటుంబాన్ని ఆదుకోవాలని ప్రభుత్వాన్ని గ్రామస్తులు కోరారు.



అ'పూర్వ' సమ్మేళనం

పెద్దవడుగూరు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1984–85వ విద్యా సంవత్సరంలో పదో చదివిన వారు ఆదివారం అదే పాఠశాల వేదికగా కలుసుకున్నారు. పాఠశాల ఆవరణలో ఉన్న సరస్వతీదేవి విగ్రహానికి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం స్థానిక ఓ ఫంక్షన్ హాల్‌లో సందడి చేశారు. తమకు విద్యాబుద్ధులు చెప్పిన నాటి గురువులను ఘనంగా సన్మానించారు. తమతో కలసి చదువుకున్న ఇద్దరు మిత్రుల కుటుంబాలకు ఆర్థిక సాయాన్ని అందజేశారు. పాఠశాల అభివృద్ధికి తమ వంతు కృషిగా ఆర్‌ఓ ప్లాంట్ మరమ్మతు, సీసీ కెమెరాల ఏర్పాటుకు రూ.50 వేల విరాళాన్ని అందజేశారు. అనంతరం వీరజవాన్ కుమ్మెత సుదర్శనరెడ్డి కుటుంబసభ్యులను సన్మానించారు. కార్యక్రమంలో ఆనాటి ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

ఊరెళ్తున్నారా.. తస్మాత్ జాగ్రత్త



- వేసవిలో బరితెగిస్తున్న దొంగలు
- తాళాలు వేసిన ఇళ్లే టార్గెట్
- అమలుకు నోచుకోని ఎల్‌హెచ్‌ఎంఎస్ సేవలు
- ముందుగా సమాచారం ఇస్తే నిఘా పెడతామంటున్న పోలీసులు



రాప్తాడు: పెళ్లిళ్లు, పండుగలకు ఊరెళ్తున్నారా.. సెలవులు వచ్చాయని ఇంటిల్లిపాది విహార యాత్రలకు వెళ్తున్నారా.. తస్మాత్ జాగ్రత్త. మీ ప్రయాణమే వరం అన్నట్లుగా తాళం పడితే చాలు దొంగలు ఇళ్లకు కన్నం వేస్తున్నారు. దాచుకున్న డబ్బు, బంగారు ఆభరణాలను క్షణాల్లో దోచుకెళ్తున్నారు. ఇంటిల్లిపాది దూర ప్రాంతాలకు ప్రయాణాలు చేసే ముందు దొంగతనాలపై అప్రమత్తంగా వ్యవహరించాల్సిన అవసరం ఉంది. వేసవి సెలవుల్లో పట్టణంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో దొంగతనాలు జరిగే అవకాశాలు అధికంగా ఉన్నాయి. ఇటీవల జరిగిన చోరీలను పరిశీలిస్తే చాలా వరకూ బీరువాలనే టార్గెట్ చేస్తున్నారు. గతంలో రాత్రి పూట తాళం వేసిన ఇంట్లో చోరీలు జరిగేవి.. ఇప్పుడు తాళం వేసిన ఇల్లు కనిపిస్తే చాలు పట్టపగలే కొల్లగొడుతున్నారు.

ప్రజలు సహకరిస్తే చోరీల నియంత్రణ..

పదో తరగతి, ఇంటర్ పరీక్షలు ముగిశాయి. అలాగే పాఠశాలలకు ఈనెల 23 నుంచి సెలవులు ఇవ్వడంతో పట్టణంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువగా ఇతర ఊళ్లు, ప్రాంతాలకు వెళ్తుంటారు. ఏటా ఈ సమయంలోనే దొంగతనాలు ఎక్కువగా జరుగుతున్నాయి. అంతేకాకుండా తాళాలు వేసి ఉన్న ఇళ్లతో పాటు ఆరుబయట నిద్రించే వారి ఇళ్లనే దొంగలు టార్గెట్ చేస్తున్నారు. ఆభరణాలు, డబ్బు కొల్లగొడుతున్నారు. అయితే ఇలాంటి దొంగతనాలు జరగకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు. ఈ ఏడాది వేసవిలో జరిగే దొంగతనాలను ఫుల్‌స్టాప్ పెట్టేందుకు సహకరించాలని కోరుతున్నారు.

సమాచారంతో ఇళ్లు భద్రం..

వేసవిలో సెలవుల్లో వివిధ ప్రాంతాలకు ప్రయాణాలు చేసే వారు ముందస్తుగా పోలీసులకు సమాచారం ఇవ్వాలి. తమ ప్రాంతాల్లో కొత్త వ్యక్తులు సంచరిస్తే తక్షణమే పోలీసుల దృష్టికి తీసుకెళ్లాలి. వేసవిలో ఉక్కపోతతో ఇళ్లలో ఉన్నవారంతా ఆరుబయట నిద్రించేందుకు ఆసక్తి చూపుతారు. వీరంతా వారి ఇళ్లల్లో వీలైనంత వరకూ విలువైన వస్తువులను బ్యాంకుల్లో భద్రపరిస్తే మంచిది. ఆయా ప్రాంతాల్లో రాత్రి పూట గస్తీ నిర్వహించే పోలీసు సిబ్బందికి ప్రజలు పూర్తి స్థాయిలో సహకరించాలి. యువత అప్రమత్తంగా వ్యవహరించి ఎటువంటి సంఘటనలు జరిగినా తక్షణమే పోలీసులకు సమాచారం ఇస్తే మేలు.

అమలు కాని ఎల్‌హెచ్‌ఎంఎస్..

లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టమ్ (ఎల్‌హెచ్‌ఎంఎస్) అనంతపురం జిల్లా కేంద్రంలో అమలు అవుతున్నా రాప్తాడులో అమలు కాలేదు. ఈ విధానం అమల్లోకి వస్తే దొంగతనాలు సులభంగా నివారించవచ్చు. స్మార్ట్‌ఫోన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్న వారి పూర్తి వివరాలు పోలీసు కంట్రోల్ రూంకు చేరతాయి. ప్రయాణాలకు వెళ్లే ముందు రోజు ఆరంకెల కోడ్‌తో పోలీస్ రిక్వెస్ట్ ఆప్షన్‌లో నమోదు చేసుకోవచ్చు. ఈ యాప్ అమల్లోకి వస్తే నమోదు చేసుకున్న వెంటనే పోలీసు సిబ్బంది వారి ఇంటికి వెళ్లి ఎల్‌హెచ్‌ఎంఎస్ పరికరాలను అమర్చుతారు. దీంతో ఇళ్లు పోలీసుల విభాగంలో కంట్రోల్‌లోకి వెళ్తుంది. ఇంట్లో ఎవరూ లేని సమయాల్లో అగంతకులు ప్రవేశిస్తే నేరుగా పోలీస్ కంట్రోల్ రూమ్‌లో అలారం మోగుతుంది. దీంతో స్థానిక పోలీసులు అప్రమత్తమై ఆ ఇంటికి చేరుకుంటారు. ఆ విధంగా ఆ ఇంటికి భద్రత ఏర్పడుతుంది. అంతేగాకుండా దొంగతనాలను నివారించవచ్చునని పోలీసులు చెబుతున్నారు.

పోలీసుల సలహాలు పాటించాలి



వేసవి సెలవుల్లో ఊరు వెళ్తున్నా వారు, పెళ్లిళ్లు, విహార యాత్రలకు వెళ్లే వారు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి. విలువైన వస్తువులు, డబ్బు దొంగల పాలు కాకుండా ఉండాలంటే పోలీసుల సలహాలు, సూచనలు తప్పకుండా పాటించాలి. విలువైన వస్తువులను ఇళ్లలో ఉంచకుండా బ్యాంకు లాకర్లలో భద్రపరచుకోవాలి. ఒక వేళ లాకర్లు వద్దనుకుంటే తమకు నమ్మకం కలిగిన బంధువులు, తెలిసినవారి ఇళ్లలో భద్రపరచుకోవాలి. అలాగే ప్రయాణాలు చేసేటప్పుడు బ్యాగులు, సూట్‌కేసులను తమ వద్దే ఉంచుకోవాలి.

– వెంకటేశులు, డీఎస్పీ, అనంతపురం రూరల్

విలువైన వస్తువులు ఇళ్లలో ఉంచుకోవద్దు



దొంగల టార్గెట్ బీరువాలపైనే ఉంటుంది. ఈ విషయంపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. విహార యాత్రలు, బంధువుల ఇళ్లకు వెళ్లే వారు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సమాచారం అందిస్తే ఆ ప్రాంతంలో గస్తీ ఏర్పాటు చేసి దొంగతనాలు జరగకుండా చూస్తాం. మీ ప్రాంతాల్లో కొత్త వ్యక్తులు సంచరిస్తున్నట్లు అనిపిస్తే సెల్‌ఫోన్‌లో వారి ఫొటోలు తీసుకోవాలి. మండల కేంద్రంలో త్వరలో లాక్డ్ హౌస్ మనిటరింగ్ సిస్టమ్‌ను అమల్లోకి తీసుకొచ్చేందుకు కృషి చేస్తాం. అనుమానితులు సంచరిస్తే 94407 96817 నంబరుకు సమాచారం అందించాలి.

– శ్రీహర్ష, సీఐ, రాప్తాడు

క్లుప్తంగా

నేడు సనపలో పెద్దమ్మ దేవర



అలంకరణలో పెద్దమ్మ దేవత

ఆత్మకూరు: మండలంలోని సనప గ్రామంలో సోమవారం నుంచి రెండు రోజుల పాటు పెద్దమ్మ దేవత దేవర నిర్వహించనున్నారు. సోమవారం అర్ధరాత్రి దున్నపోతును బలి ఇస్తారు. మంగళవారం పెద్దమ్మ తల్లి విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు చేస్తామని గ్రామస్తులు తెలిపారు. గ్రామంలో ప్రతి ఇంట్లో పెద్దమ్మ తల్లికి పొట్టేళ్లు, గొర్రెలను బలి ఇచ్చి మెక్కులు తీర్చుకుంటారు.

చట్టాన్ని ఉల్లంఘిస్తే చర్యలు



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్‌ఐ సత్యనారాయణ

చెన్నేకొత్తపల్లి: గ్రామాల్లో గొడవలకు దూరంగా ఉంటూ ప్రశాంతంగా జీవించాలని ఎస్‌ఐ సత్యనారాయణ సూచించారు. ఆదివారం మండలంలోని వివిధ గ్రామాల్లో ఉన్న రౌడీషీటర్లను స్థానిక పోలీస్ స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ.. కష్టపడి పని చేసుకుంటూ పిల్లలను చదివించుకోవాలన్నారు. అనవసరంగా గొడవలకు పాల్పడితే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగించకుండా ఉండాలన్నారు. చట్టాన్ని ఉల్లంఘిస్తే చర్యలు తప్పవన్నారు.

రేపటి నుంచి వేసవి విజ్ఞాన శిబిరం

చెన్నేకొత్తపల్లి: మండల కేంద్రంలోని గ్రంథాలయంలో ఈనెల 29 నుంచి జూన్ 6వ తేదీ వరకూ వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరం నిర్వహించనున్నట్లు గ్రంథాలయ అధికారి జయరాం ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. రోజూ ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకూ పుస్తక పఠనం, పుస్తక సమీక్ష, ముద్రించిన కథలు చెప్పడం, చిత్రలేఖనంపై శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు. ఒకటి నుంచి పదో తరగతి చదువుతున్న విద్యార్థులు మాత్రమే గ్రంథాలయానికి రావాలని సూచించారు.

చిన్నారులకు ఉచిత ఖత్నా



చిన్నారులతో డాక్టర్ గఫూర్

అనంతపురం కల్చరల్: జాతీయ బహుళార్థక సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం 60 మంది చిన్నారులకు ఉచితంగా ఖత్నా చేశారు. గఫూరు కాలనీలో జరిగిన కార్యక్రమంలో డాక్టర్ అబ్దుల్ రజాక్ గఫూర్ మాట్లాడారు. ఆరోగ్యరీత్యా ఎంతో ఖత్నా చేయించుకుంటే మంచిదన్నారు. ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న వారిని దృష్టిలో ఉంచుకుని ఉచితంగా ఖత్నా చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ బాషా, షాకీర్, షామీర్, ఐఎంఎం బాషా, షైక్‌నిజాం, జాకీర్, షౌకత్ తదితరులు పాల్గొన్నారు.

'ఆర్డీటీపై ఆంక్షలు విధించొద్దు'



మాట్లాడుతున్న సాకే హరి

అనంతపురం టవర్‌క్లాక్: ఆర్డీటీపై ఆంక్షలు విధిస్తే పెద్ద ఎత్తున పోరాటాలు చేస్తామని ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి హెచ్చరించారు. ఆదివారం స్థానిక కలెక్టర్ కార్యాలయం ఎదురుగా ఉన్న ఫెర్రర్ విగ్రహం వద్ద ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సాకే హరి మాట్లాడుతూ.. అభివృద్ధి ,పేదరిక నిర్మూలన కోసం ఆర్డీటీ సేవ చేస్తోందన్నారు. విదేశాల నుంచి ఆర్డీటీకి నిధులు రాకుండా అడ్డుకోవడం దుర్మార్గమన్నారు. ఫారిన్ కంట్రిబ్యూషన్ రెగ్యులేషన్ యాక్ట్ (ఎఫ్‌సీఆర్‌ఏ) కింద వివిధ దేశాల నుంచి ఆర్డీటీకి అందుతున్న సహాయాన్ని అడ్డుకోవడం సరికాదని హితవు పలికారు. తక్షణమే నిధులు వచ్చేలా చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో కుల, ప్రజా సంఘాలను కలుపుకుని పెద్ద ఎత్తున పోరాటాలు చేస్తామని స్పష్టం చేశారు. పేదల కోసం అహర్నిశలు కృషి చేస్తున్న రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్టుపై కుట్రలు చేయడం మానుకోవాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో హరినాథ్ రెడ్డి, ఆనంద్, మల్లికార్జున, రాఘవ, శివన్న, రామకృష్ణ, సూర్యనారాయణ, నారాయణ స్వామి, రామాంజనేయులు, లక్ష్మీనారాయణ, పెద్దిరాజు, పుల్లన్న, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

భవిష్యత్తులో ఉన్నతస్థాయికి ఎదగాలి



విద్యార్థినికి ప్రోత్సాహక బహుమతి అందజేస్తున్న దృశ్యం



విద్యార్థిని రెనీల ప్రియను సత్కరిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం ఎడ్యుకేషన్: ఇటీవల విడుదలైన పదో తరగతి, ఇంటర్ ఫలితాల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం అభినందన సభ ఏర్పాటు చేశారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రగతి, డీవైఎఫ్ఐ జిల్లా కన్వీనర్ కసాపురం రమేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు సిద్దు, డీవైఎఫ్ఐ మాజీ నాయకులు రామిరెడ్డి, బాలల సంఘం నాయకురాలు ఉషారాణి, సరళ, నగేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదువుతూ కార్పొరేట్ విద్యాసంస్థలతో పోటీపడి మార్కులు సాధించారన్నారు. తల్లిదండ్రులు నిత్యం కూలి పనులకు వెళ్తూ తమ పిల్లలను చదవించడం హర్షణీయమని తెలిపారు. ఎన్ని సమస్యలు ఎదురైనా భవిష్యత్తులో ఉన్నతస్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. చదువును నిర్లక్ష్యం చేయకుండా ముందుకు సాగాలన్నారు. సోషల్ మీడియా, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు భీమేష్, నాగభూషణం, అజయ్, విజయ్, మహేష్, సురేంద్ర, మనోహర్, చరణ్ పాల్గొన్నారు.

మినర్వా విద్యార్థినికి అభినందన

అనంతపురం ఎడ్యుకేషన్: ఇటీవల విడుదలైన పదో తరగతి ఫలితాల్లో 596 మార్కులు సాధించి జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచిన స్థానిక మినర్వా పాఠశాల విద్యార్థిని రెనీల ప్రియను కలెక్టర్ వినోద్ కుమార్ ప్రత్యేకంగా అభినందించారు. ఆదివారం కలెక్టర్ చేతుల మీదుగా విద్యార్థినిని సత్కరించారు. రెనీల ప్రియను స్ఫూర్తిగా తీసుకోవాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.ప్రసాద్‌బాబు, మినర్వా పాఠశాల కరస్పాండెంట్ జి.భాస్కర్‌రెడ్డి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అనాథలకు అండగా నిలుస్తాం



సమ్మిళిత కేంద్రంలో అంధులతో మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం కల్చరల్: అంధులు, అనాథలకు తోడ్పాటు అందిస్తున్న మీనాక్షి సమ్మిళిత వికాస కేంద్రం కృషి అభినందనీయమని కలెక్టర్ వినోద్‌కుమార్ అన్నారు. ఆదివారం ఆర్డీఓ ఆఫీసు రోడ్డులో మీనాక్షి సమ్మిళిత కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. సంస్థలో చదువుతున్న అనాథ బాలికలు భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి చేరుకునేందుకు తమ వంతు సహకారం అందిస్తామ తెలిపారు. ముఖ్యంగా ప్రభుత్వం తరపున ఎటువంటి సహాయ సహకారాలనైనా అందించడానికి అధికారులు ముందుండాలని సూచించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు భవన నిర్మాణానికి కావాల్సిన ప్రతిపాదనలు వారం రోజుల్లోపు పంపిస్తామన్నారు. సంస్థ ద్వారా రవికాంత్ రమణ కొన్నేళ్లగా చేస్తున్న సేవలు ఎంతో మందికి ఆదర్శంగా నిలిచాయని కొనియాడారు. కార్యక్రమంలో ఆర్డీఓ కేశవనాయుడు, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ అధికారి వినోద్, వెంకటరారాయణ తదితరులు పాల్గొన్నారు.

'వైకల్యం సాహిత్య రచనకు అడ్డు కాలేదు'



రచయితను సత్కరిస్తున్న సాహితీవేత్తలు, కవులు

అనంతపురం కల్చరల్: అంగవైకల్యాన్ని జయించి సాహిత్య రచనలు చేస్తున్న వెంకటేష్ ఎంతో మందికి స్ఫూర్తిదాయకమని ఆచార్య బాలసుబ్రహ్మణ్యం కొనియాడారు. ఆదివారం యువరచయిత వెంకటేష్ రచించిన స్వామి చినుకు నవల, ప్రభుత్వాధినేతలు పుస్తకాలను స్థానిక ఉపాధ్యాయ భవన్‌లో ఆవిష్కరించారు. ఆచార్య ఏవీ రమణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నిర్వాహకులు టీవీరెడ్డి, విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ రంగస్వామి, డాక్టర్ అంకె శ్రీనివాస్, రాజామణి, రాజారాం, జిరసం అధ్యక్షుడు కొత్తపల్లి సురేష్ తదితరులు మాట్లాడారు. ఈ సందర్భంగా గోసల నారాయణస్వామి ఆలపించిన ఉద్దీపన గీతం ఆకట్టుకుంది. రచయిత దివ్యాంగుడైనప్పటికి ఆత్మవిశ్వాసంతో జీవితాన్ని సాహిత్యం వైపు మళ్లిస్తున్న తీరు అభినందనీయమన్నారు. అంతకు ముందు పహల్గాం మృతులకు శ్రద్ధాంజలి ఘటించారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా సాహితీలోకం చైతన్యం చేయాలని సూచించారు. కార్యక్రమంలో మానవత తరిమెల అమరనాథ రెడ్డి, డాక్టర్ అంకె రామలింగమయ్య, డాక్టర్ జెన్నే ఆనంద్, మధురశ్రీ, వన్నప్ప, రియాజుద్దీన్, చెట్ల ఈరన్న, శంకరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉగ్రవాదుల దాడి పిరికిపంద చర్య



నిరసన తెలుపుతున్న మేయర్ వసీం తదితరులు

అనంతపురం కల్చరల్: ఉగ్రవాదుల దాడి పిరికిపంద చర్య అని, భారతీయులందరూ ఐక్యంగా ఉగ్రవాదంపై పోరాడాలని మేయర్ వసీం పిలుపునిచ్చారు. తెహరిక్ ఫైజానే ఉమర్ ఫారూక్, రెండవ రోడ్డు బహఉద్దీన్ మసీదు ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి పహల్గాం దాడిని ఖండిస్తూ నగరవీధుల్లో కొవ్వొత్తులతో శాంతి ర్యాలీ సాగింది. స్థానిక రెండో రోడ్డు మసీదు నుంచి నీలిమ సర్కిల్ వరకూ ర్యాలీ చేపట్టారు. అనంతరం శాంతియుతంగా మానవహారం నిర్మించారు. ఉగ్రవాదులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. బహవుద్దీన్ మసీదు ముతవల్లి ఫరీదుద్దీన్, మసీదు ఇమామ్ యూసుఫ్‌ఖాన్, ఉమర్‌ఫారూక్ అధ్యక్షుడు హసన్‌రజా తదితరులు మాట్లాడారు. దోషులను కఠినంగా శిక్షించాలని కోరారు. మేయర్ వసీం, డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కరరెడ్డి, కాంగ్రెస్ పార్టీ దాదా గాంధీ, వైఎస్సార్‌సీపీ మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు సైఫుల్లాబేగ్ మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ ఫయాజ్‌బాషా, సీపీఎం రామభూపాలరెడ్డి, కార్పొరేటర్ చంద్రమోహన్, తదితరులు ఉగ్రదాడిని ఖండించారు. మృతుల కుటుంబాలకు సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు జావీద్, మహబూబ్ బాషా, కాకర్ల శ్రీనివాసులు, ఐఎంఎం బాషా, సీపీఎం నగర కార్యదర్శి రాంరెడ్డి, మసూద్, ఫరీద్, సమీ, తాజుద్దీన్ పాల్గొన్నారు.

బొమ్మేపర్తిలో భగవద్గీతపై ప్రచారం



మాట్లాడుతున్న త్రైత సిద్ధాంత ప్రబోధసేవా సమితి సభ్యులు

రాప్తాడు: 'బ్రహ్మరాత ఎలా రాసి పెట్టి ఉంటే అలా జరుగుతుంది. నిజమే తలరాతను ఎవరూ మార్చుకోలేక పోవచ్చు. భగవద్గీతను చదివితే మాత్రం జీవన రేఖను దివ్యంగా మార్చుకోవచ్చు' అని త్రైత సిద్ధాంత ప్రబోధసేవా సమితి ఇందూ జ్ఞానవేదిక జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని బొమ్మేపర్తి, పుల్లలరేవు గ్రామాల్లో ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరుల ఆధ్యాత్మిక త్రైత సిద్ధాంత భగవద్గీత, 100 రకాల త్రైత సిద్ధాంత గ్రంథాలను ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భగవద్గీతను ప్రతి ఒక్కరూ జీవితంలో ఒక సారి అయినా చదివి, మారమార్థం తెలుసుకోవాలన్నారు. పౌర్ణమి అనునది పూర్ణ దైవ జ్ఞానానికి గుర్తు, అలాగే అమావాస్య అనునది అజ్ఞానానికి గుర్తుగా ఉందని తెలిపారు. అజ్ఞానం నుంచి వెలుగు వైపు అంటే దైవ జ్ఞానం వైపు ప్రయాణించాలి అని వివరించారు. శ్రీకృష్ణుడు, భగవద్గీతను నమ్మకపోతే అమావాస్య వైపు నడిచి అజ్ఞానంలో మునిగి మోక్షం పొందలేరన్నారు. అనంతరం భగవద్గీత పుస్తకాలను వితరణ చేశారు. కార్యక్రమంలో నాగిరెడ్డి, సుధాకర్, చిరంజీవి, నరేష్, రామకృష్ణ, శివ సాయి, నల్లప్ప, నీలావతి, నాగేశ్వరి, లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలి



విద్యార్థినికి స్మార్ట్ మొబైల్ ఇస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం ఎడ్యుకేషన్: స్వధా ఫౌండేషన్ ద్వారా జిల్లాలో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని నిర్వాహకులకు కలెక్టర్ వినోద్ కుమార్ సూచించారు. ఆదివారం అనంతపురంలోని ఎస్ఎస్‌బీఎన్ డిగ్రీ కళాశాలలో స్వధా ఫౌండేషన్ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని, ప్రసంగించారు. ఉభయ గోదావరి జిల్లాల్లో సాగునీరు ఎక్కువగా ఉంటుందని సంవత్సరానికి నాలుగు పంటలు పండించుకోవచ్చన్నారు. అయితే వారి కంటే ఎక్కువగా అనంతపురం జిల్లాలో హార్టికల్చర్, మైక్రో ఇరిగేషన్ ద్వారా పంటలు పండిస్తున్నారని గుర్తు చేశారు. జిల్లా ఫ్రూట్ బౌల్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ కాకుండా, ఫ్రూట్ బౌల్ ఆఫ్ ఇండియాగా ఖ్యాతి గడిస్తోందన్నారు. అనంతపురం నుంచి ఎగుమతి అవుతున్న పుచ్చకాయలకు ఢిల్లీలో ఎక్కువగా డిమాండ్ ఉందన్నారు. అలాగే దుబాయ్‌కి సైతం అనంతపురం జిల్లా నుంచి అరటిని ఎగుమతి చేస్తున్నామన్నారు. జిల్లాలో అధిక సంఖ్యలో ఎన్జీఓలు పనిచేస్తున్నాయని, ఆర్డీటీ, శ్రీసత్యసాయి సంస్థలతో పాటు మొక్కలు నాటడం, ఆడపిల్లలను చదివించే కార్యక్రమాలు చాలా ఎన్జీఓలు చేపడుతున్నాయన్నారు. ఇందులో స్వధా ఫౌండేషన్ నిలవడం అభినందనీయమన్నారు. 15 ఏళ్లుగా నిరుపేద కుటుంబాల పిల్లల ఉన్నత చదువులకు ఆర్థిక సాయం, ఉన్నత విద్య కోసం శిక్షణ, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించేందుకు శిక్షణ కార్యక్రమాలను ఏర్పాటు చేసి, స్మార్ట్ ఫోన్లు, కంప్యూటర్లు, ట్యాబ్ లు ఇచ్చి అండగా నిలుస్తున్న స్వధా ఫౌండేషన్ సేవలను కొనియాడారు. అనంతరం విద్యార్థులకు సర్టిఫికెట్లు, స్మార్ట్ ఫోన్లను కలెక్టర్ అందజేశారు. కార్యక్రమంలో డీఈఓ వెంకటరమణనాయక్, స్వధా ఫౌండేషన్ నిర్వాహకులు రాజేష్, రామ్, దివ్య, విద్యార్థులు తల్లితండ్రులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరా పాహిమాం



అలంకరణలో సర్పరూపుడు



స్వామి స్వర్ణ కవచాన్ని మేళతాళాలతో ఊరేగిస్తున్న దృశ్యం

ఆత్మకూరు: పంపనూరులోని సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం స్వామికి విశేష పూజలు పంచామృతాభిషేకాలు నిర్వహించారు. తొలుత ఆకుపూజ నిర్వహించి పట్టు వస్త్రాలు, బంగారు ఆభరణాలతో అలంకరించారు. అనంతరం మంజునాథ స్వామి, పార్వతీ దేవికి ప్రత్యేక పూజలు చేశారు. మహా మంగళహారతి అనంతరం స్వామి వారి స్వర్ణ కవచాన్ని మేళతాళాలతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేయించారు. ఆలయ ప్రాంగణంలో పెద్ద ఎత్తున కాలసర్పదోష నివారణ రాహుకేతు హోమాలు చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు అన్నదానం చేశారు.

చిన్నారులు సేదతీరేందుకే 'బాల విహార్'



బాలవిహార్‌లో పాల్గొన్న చిన్నారులు

అనంతపురం కల్చరల్: నగరంలోని తపోవనం జగదీశ్వరాలయం వేదికగా వేసవి శిక్షణ శిబిరం (బాలవిహార్) ఆదివారం ప్రారంభమైంది. దాదాపు 200 మంది చిన్నారులు వివిధ ఆటపాటలతో వేసవి సెలవులను ఉత్సాహంగా ఆరంభించారు. ఉదయం చిన్మయామిషన్ జిల్లా ఇన్‌చార్జి స్వామి ఆత్మవిదానంద సరస్వతి అధ్యక్షతన జరిగిన సమావేశానికి డీఆర్వో మలోల, చిన్మయా మిషన్ ప్రెసిడెంట్ తాళంకి సత్యనారాయణ అతిథులుగా విచ్చేశారు. ఈ సందర్భంగా స్వామీజీ మాట్లాడుతూ.. కేవలం పొద్దుపోగొట్టడానికి ఆటపాటలు నేర్పించడం కాకుండా నైతిక విలువలను పెంపొందించే జీవన విధానాన్ని నేర్పడం ప్రధానంగా సాగుతుందన్నారు. వచ్చే నెల 8 వరకూ మాత్రమే శిక్షణ శిబిరం ఉంటుందన్నారు. ఇందులో శారీరక, మానసిక పరిపక్వత చెందే విషయాలను ఉచితంగా బోధిస్తారని తెలిపారు. కార్యక్రమంలో నిర్వాహకులు మురళీమోహనరెడ్డి, గుప్తా, పురుషోత్తమరెడ్డి, సురేష్, జగన్నాథ్ తదితర చిన్మయామిషన్ సభ్యులు పాల్గొన్నారు.

బెన్‌హర్ బాబు సేవలు అభినందనీయం



సీఎస్‌ఐ సంఘ కాపరి డాక్టర్ బెన్‌హర్ బాబును సన్మానిస్తున్న దృశ్యం

అనంతపురం కల్చరల్: ఇటీవల గౌరవ డాక్టరేట్ అందుకున్న అరవింద నగర్ సీఎస్‌ఐ సంఘ కాపరి డాక్టర్ బెన్‌హర్ బాబును ఆదివారం సన్మానించారు. ప్రార్థనా మందిరానికి చెందిన వివిధ విభాగాల వారి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో సంఘం నిర్వాహకులు చంద్రశేఖర్ జాన్, జాన్ సుధీర్, జడ్.దేవరాజ్, గ్లోరీ సుమన్, సునీల్ కుమార్ తదితరులు మాట్లాడారు. జిల్లాలోనే ప్రసిద్ధి గాంచిన సీఎస్‌ఐ చర్చికి బెన్‌హర్ బాబు అందిస్తున్న సేవలు అభినందనీయమన్నారు. పాస్టర్‌గా ఆయన ప్రబోధాలు స్ఫూర్తిదాయకమని తెలిపారు. కేవలం ఆధ్యాత్మిక ప్రసంగాలతోనే కాకుండా సేవాభావం వైపు క్రైస్తవుల జీవితాలకు అర్థం కల్పిస్తున్నారని కొనియాడారు. భవిష్యత్తులో ఉన్నతస్థాయికి చేరుకోవాలని ఆకాక్షించారు. ప్రత్యేక ప్రార్థనల అనంతరం పాస్టర్ బెన్‌హర్ బాబును ఘనంగా సత్కరించారు.

సంతల ఆదాయం రూ.4.16 లక్షలు

అనంతపురం అగ్రికల్చర్: స్థానిక వ్యవసాయ మార్కెట్‌యార్డులో ఈ వారం జరిగిన పశువులు, జీవాల సంతల ద్వారా రూ.4.16 లక్షలకు పైగా ఆదాయం వచ్చినట్లు సెక్రటరీ కె.గోవిందు తెలిపారు. అందులో శనివారం జరిగిన గొర్రెలు, మేకలు, పొట్టేళ్ల సంత నుంచి రూ.2,65,910 వసూలు కాగా, ఆదివారం జరిగిన ఆవులు, ఎద్దుల సంత నుంచి రూ.1,50,410 మేర వసూలైనట్లు పేర్కొన్నారు.

ఎఫ్‌సీఆర్‌ఏ పునరుద్ధరించాలి

అనంతపురం కార్పొరేషన్: రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ (ఆర్డీటీ)కి సంబంధించి ఫారిన్ కంట్రిబ్యూషన్ రెగ్యులేషన్ యాక్ట్ (ఎఫ్‌సీఆర్‌ఏ) వెంటనే పునరుద్ధరించాలని డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఆయన తన క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. కేంద్రం విదేశీ నిధులను ఆపడం జరిగిందన్నారు. ఆర్డీటీ సేవలు జిల్లాలో మాత్రమే కాకుండా ఏపీ, తెలంగాణాలో కొనసాగుతున్నాయని గుర్తు చేశారు. ఏటా రూ.500 కోట్లతో అన్ని వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తున్నారని కొనియాడారు. విద్య, వైద్యంతో పాటు లక్ష ఇళ్లను నిర్మించి పేదలకు అందజేయడ జరిగిందని గుర్తు చేశారు. కేంద్రం నిర్ణయంతో ఆర్డీటీ సేవలు నిలిచిపోయే ప్రమాదం ఉందని తెలిపారు. కూటమి ప్రభుత్వం వెంటనే స్పందించాలని కోరారు.

కొబ్బరి చెట్టుపై పిడుగు



కాలిపోతున్న కొబ్బరి చెట్టు

రాప్తాడు: పిడుగు పడి కొబ్బరి చెట్టు దగ్ధమైన ఘటన మండలంలోని గొందిరెడ్డిపల్లి గ్రామంలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. వివరాలు.. గొందిరెడ్డిపల్లి గ్రామంలో ఆదివారం సాయంత్రం ఈదురు గాలులతో భారీ వర్షం కురిసింది. స్థానిక ఎస్సీ కాలనీలో అంగన్‌వాడీ కేంద్రం సమీపంలో ఓ ఇంటి వెనక భాగంలో ఉన్న కొబ్బరి చెట్టుపై పిడుగు పడింది. ఒక్కసారిగా కొబ్బరి చెట్టుపై మంటలు వ్యాపించడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. చెట్టుపై నీరు పోసి మంటలను ఆర్పేశారు. చెట్టు సగభాగం కాలిపోయింది. పిడుగు పడిన సమయంలో కొబ్బరి చెట్టు దగ్గర ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది.